## నకిలీ పత్రాలతో భూ కబ్జా

- వారసుడిని సృష్టించి 25 ఎకరాల స్థలాన్ని కొట్టేసిన వైనం
- డిపెండెంట్ సర్టిఫికెట్లతో స్థలాన్ని కబ్జా చేసి, అసలు వారసులకు అన్యాయం
- తలమడుగు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేశాం
- ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్



ఎదులాపురం, మే 29: నకిలీ పత్రాలతో వారసుడిని సృష్టించి 25 ఎకరాల స్థలాన్ని కొట్టేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. గురువారం తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కజ్జర్లలో 1954 సంవత్సరంలో ప్రభుత్వం అమీనుద్దీన్ ఖాన్‌కు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అమీనుద్దీన్‌కు ఒక కూతురు మాత్రమే ఉండడంతో కేటాయించిన స్థలం చాలా ఏండ్లుగా ఖాళీగా ఉంది. ఆ స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేయాలని తలమడుగు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి అనుకున్నాడు. దీంతో అమీనుద్దీన్ మనవడిగా షేక్ లతీఫ్‌ను సృష్టించాడు. అమీనుద్దీన్ వారసుడిగా తలమడుగు రెవెన్యూ అధికారుల వద్ద నుంచి డిపెండెంట్ సర్టిఫికెట్‌ను తీసుకున్నాడు. ఈ డిపెండెంట్ సర్టిఫికెట్ ఆధారంగా అమీనుద్దీన్ పేరుపై ఉన్న 25 ఎకరాల స్థలాన్ని 2005 సంవత్సరంలో షేక్ లతీఫ్ పేరుపై బదిలీ చేయించాడు. ఇది ప్రభుత్వ భూమి, అసైన్డ్‌ల్యాండ్ కావున 2009వ సంవత్సరంలో ఆర్డీవో వద్ద నుంచి నో అబ్జెక్షన్ లెటర్‌ను తీసుకున్నాడు. తర్వాత ప్రధాన సూత్రధారి అయిన తలమడుగు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి లెటర్ అందిన నాలుగు రోజుల వ్యవధిలో తనపై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈ కేసులో ఇటీవల అమీనుద్దీన్ అసలు వారసులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు వివరాలు బయటపడ్డాయి. ప్రస్తుతం తలమడుగు మండలంలో కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేశామని, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి

ఎదులాపురం,మే 29 : ఆదిలాబాద్ జిల్లా మావల బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందినట్లు మావల సీఐ స్వామి తెలిపారు. కేసు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్‌కు చెందిన దాడి అకాశ్(21), అల్లకొండ కళ్యాణ్(22) స్నేహితులు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్నారు. మావల బైపాస్ క్రాసింగ్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అప్పటికే దాడి అకాశ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం అల్లకొండ కళ్యాణ్ మృతి చెందాడు. ఇద్దరు ఫ్లవర్ డెకరేషన్ రంగంలో పని చేస్తుండగా, వారి మృతితో ఖానాపూర్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గుర్తు తెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరి..

భైంసాటౌన్, మే 29 : నిర్మల్ జిల్లా భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్(20) చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 9 గంటలకు బషీర్ తిమ్మాపూర్ నుంచి చాక్‌పల్లి గ్రామానికి వెళ్లడానికి బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా గుర్తు తెలియని కారు వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఛాతి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

జైనథ్, మే 29 : భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని రాంపూర్(టీ) గ్రామంలో చోటు చేసుకుంది. జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్ వివరాల ప్రకారం.. రాంపూర్(టీ) గ్రామానికి చెందిన గోర్ల సురేఖ(30)తో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గోర్ల సంతోష్‌తో 2013లో వివాహం జరిగింది. దంపతులకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఇటీవల భర్త శంకర్ వేధిస్తుండడంతో మానసికంగా కుంగిపోయిన సురేఖ 15 రోజుల క్రితం పుట్టింటి గ్రామమైన రాంపూర్‌కు వచ్చింది. గురువారం ఉదయం భర్త శంకర్‌తో జరిగిన గొడవ అనంతరం ఆమె ఇంట్లో ఉన్న దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు సురేఖ తల్లి రాధబాయి ఫిర్యాదు మేరకు జైనథ్ మండల రూరల్ సీఐ సాయినాథ్ ఘటన స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ మార్చురికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జైనథ్ రూరల్ సీఐ తెలిపారు.

### సాత్నాల వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

జైనథ్, మే 29: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం తరోడ గ్రామ సమీపంలోని సాత్నాల నదిలో వరదలో గల్లంతైన లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండె దత్తు (30) గురువారం పూసాయి గ్రామ సమీపంలోని సాత్నాల నదిలో లభ్యమైంది. ఎస్ఐ గౌతమ్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లోని మార్చురి గదికి తరలించారు. కుటుంబ సమస్యల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**- ఇద్దరిపై కేసు నమోదు**

ఎదులాపురం, మే 29: ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఫేక్ జాబ్ ఐడీ కార్డులు, ఫేక్ లెటర్లు తయారు చేసి బాధితుల నుంచి రూ.7లక్షల వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. కేసు వివరాలు సీఐ వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బాధితుడు గంగాధర్‌కు ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ హైదరాబాద్ అల్కాపురి కాలనీకి చెందిన వినయ్ కుమార్ రూ.7లక్షల ఐదు వేలు వసూలు చేశాడు. దీంతో ఆదిలాబాద్ మొచ్చి గల్లీకి చెందిన బాధితుడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు గంగాధర్ విచారణ చేపట్టగా వినయ్ కుమార్‌ను గురువారం అరెస్టు చేశామని తెలిపారు. విచారణలో వినయ్‌తో పాటు రమేశ్ కూడా నేరం చేసినట్లు తెలిసిందని అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

### అదనపు కట్నానికి బలైన వివాహిత

ఎదులాపురం, మే 29 : అదనపు కట్నానికి వివాహిత బలైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలానికి చెందిన బండి ప్రసన్న(29)కి అదే జిల్లాకు చెందిన ప్రమోద్ కుమార్ 2022లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్లయిన మూడు నెలలు బాగా ఉంటూ ఆ తర్వాత అదనపు కట్నం కోసం భార్యను వేధించడం మొదలుపెట్టాడు. దీంతో మేస్త్రి పని కోసం ఆదిలాబాద్ జిల్లాకు పది రోజుల క్రితం వచ్చారు. పట్టణంలోని ద్వారక నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇక్కడికి వచ్చిన అదనపు కట్నం తీసుకురావాలని మళ్లీ శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. వేధింపులు భరించలేక బుధవారం ప్రసన్న తన చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న బండి ప్రవీణ్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో బావ ప్రమోద్ కుమార్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

## ఇన్ఫెక్షన్ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా




ఏఐసీ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, రిమ్స్ డైరెక్టర్, సూపరిండెండెంట్లు, టీడీసీవో

ఎదులాపురం,మే 29 : దవాఖానల్లో ఇన్ఫెక్షన్ ప్రబలకుండా నిరోధక చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ రిమ్స్ వాయుమార్గ సంక్రమణ నియంత్రణ( ఎయిర్‌బోర్న్ ఇన్ఫెక్షన్ల నియంత్రణపై-ఏఐసీ)పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దవాఖానల స్థాపనలో ఇన్ఫెక్షన్ల నియంత్రణ కీలకమైన అంశంగా పేర్కొన్నారు. రోగులకు ఆపరేషన్ తర్వాత ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశాలు అధికంగా ఉండే నేపథ్యంలో వార్డుల్లో పూర్తిస్థాయిలో శుభ్రత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్ఫెక్షన్ వ్యాప్తి నియంత్రణపై వైద్యులు, ఇతర సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. పీపీఈ కిట్లు, మాస్కులు, హ్యాండ్‌వాష్, బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ తదితర అంశాల్లో సరికొత్త జాగ్రత్తలు తీసుకుని వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్ఫెక్షన్ల కారణంగా మరణాలు సంభవించిన సందర్భాలు ఉన్నాయని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, టీబీ నియంత్రణ అధికారి సుమలత, సూపరింటెండెంట్లు అశోక్, సత్యనారాయణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి



లబ్ధిదారులకు రెండు పడకల పట్టా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్, మే 29 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు పడకల ఇళ్ల పట్టాల ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నార్నూర్‌లో 15, కొత్తపల్లి(హెచ్)లో 10 మంది లబ్ధిదారులకు రెండు పడకల ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రెండు పడకల ఇళ్లను పంపిణీ చేశామని, అర్హులైన లబ్ధిదారులు ఎంపిక చేసి వారికి పట్టా ధ్రువీకరణ పత్రాలు అందించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్ర భుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏ పథకాన్ని పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. కొలాం గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలు అర్హులైన నిరుపేదలను గుర్తించి అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గంగపూర్ గ్రామంలో ఇందిరమ్మ ప్రొసిండింగ్ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో రాథోడ్ గంగసింగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్, మండల పంచాయతీ అధికారి సాయిప్రసాద్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, మాజీ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు మడావి ముక్తారూప్‌దేవ్, కనక ప్రభాకర్, రామేశ్వర్, నాయకులు చంద్రశేఖర్, రాథోడ్ రమేశ్, అలంఖాన్, శివాజీ, సుభాష్ పాల్గొన్నారు.

### పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

నిర్మల్ అర్బన్, మే 29 : పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి అన్నారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

భైంసా, మే, 29 : పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా భైంసాలోని మున్సిపల్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల ప్రజలు కలిసి మెలసి ఉంటూ భైంసా అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే కమిషనర్, పట్టణ సీఐని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, పట్టణ సీఐ గోపీనాథ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నిర్మల్ అర్బన్: మాట్లాడుతున్న ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి

### కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

బోథ్, మే 29: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక పోరాట వీరుడు, తెలంగాణ తొలి మలిదశ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని పద్మశాలీ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ బస్టాండ్ ఎదుట విగ్రహం వద్ద పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు ఆసాల సదాశివ్, గౌరవాధ్యక్షుడు గంగుల మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ప్రధాన కార్యదర్శి మాసం అనిల్ కుమార్, ఆడెపు కిరణ్, సగ్గం దాస్, లక్ష్మణ్, వెంకటేశ్, దయాకర్, కొండ స్వామి, మర్లపల్లి గంగాధర్, సురేశ్, రమేశ్‌రెడ్డి, ఆర్టీవీ ప్రసాద్, ఎలుక రాజు, మేర గంగాధర్ పాల్గొన్నారు.

### కబడ్డీ స్టేట్ గోల్డ్ మెడల్ రితికా జాబడేకు సన్మానం




గోల్డ్ మెడల్ సాధించిన రితికా జాబడే

ఎదులాపురం, మే 29: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (ఎస్సీ-గురుకులం) ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో స్టేట్ గోల్డ్ మెడల్ రితికా జాబడే సాధించింది. హైదరాబాద్‌లో బాబు జగ్జీవన్ రామ్ భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. క్రీడాకారులను జ్ఞాపికలు అందజేసి శాలువాతో సత్కరించారు. జాతీయ స్థాయిలో రాణిస్తూ తెలంగాణ పేరును నిలబెట్టాలని సీఎం ఆకాంక్షించారు. తల్లిదండ్రులతో దాదా సాహెబ్ ఉన్నారు.

### విద్యుత్ సరఫరా లేక రైతులకు ఇబ్బందులు

ఇచ్చోడ, మే 29: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని తలమద్రిలో ఏప్రిల్ 18వ తేదీన ఈదురుగాలులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు కుప్పకూలిపోయాయి. ఈ విషయాన్ని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పంటల సాగుకు విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

### అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పట్టిక పట్టివేత

ఖానాపూర్ టౌన్, మే 29: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన అబ్దుల్ అన్వర్, కరిపే రంజిత్ పట్టణానికి చెందిన అబ్దుల్ రాఫెఖాన్ అనే కిరాణ వ్యాపారి నుంచి 5 క్వింటాల్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా ఖానాపూర్ శివారు ప్రాంతంలో పట్టుకున్నట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. వీరిద్దరిని విచారించగా అబ్దుల్ రాఫెఖాన్ అనే కిరాణ వ్యాపారి నుంచి కొనుగోలు చేసిన బెల్లం, పట్టికను చుట్టుప్రక్కల గ్రామాల్లో నాటు సారా తయారీదారులకు అమ్మతామని తెలపడం జరిగింది. అబ్దుల్ అన్వర్, కరిపే రంజిత్, అబ్దుల్ రాఫెఖాన్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అభిషేకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కుమ్రం భీం చౌక్ కుదింపుపై ఆదివాసుల నిరసన

ఎదులాపురం, మే 29 : ఆదిలాబాద్‌లోని కుమ్రం భీం చౌక్ వద్ద ఉన్న సర్కిల్‌ను కుదించడం ఆదివాసీ యోధుడు కుమ్రం భీంకు అవమానమేనని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. అధికారుల తీరుకు వ్యతిరేకంగా గురువారం కుమ్రం భీం చౌరస్తాలోని ం విగ్రహం ఎదుట ఆదివాసులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్- జంగల్- జమీన్ కోసం పోరాడిన వీరు కుమ్రం భీంకు ఆదిలాబాద్‌లో స్థలం లేకపోవడమే దురదృష్టకరం. గతంలో బీఆర్ఎస్ పాలనలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి చౌక్‌ను సుందరంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ట్రాఫిక్ సమస్య పేరు చెప్పి కూడలిని కుదిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ నాయకులను సంప్రదించకుండా తీసుకునే ఏకపక్ష నిర్ణయాలు సరైనవేమీ కావని స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ హయాంలో న్యాయం జరిగితే, కాంగ్రెస్ హయాంలో అన్యాయం జరిగిందన్నారు. అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే ఉద్యమాలు ఊపందుకుంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీఎం రాష్ట్ర నాయకులు కుర్సేంగ యాదవ్ రావ్, కొల్లం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సోనేరావ్, కుమ్ర శ్రీనివాస్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మాజీ ఎంపీటీసీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కుమ్ర జంగు, చించుఘట్ గ్రామ పటేల్ కుమ్ర రాజు పటేల్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సకోల అశోక్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ పాల్గొన్నారు.



కుమ్రం భీం విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసులు

### ధర్నాను జయప్రదం చేయాలి

భైంసా, మే 29 : కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన కుమార్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా భైంసాలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 600 కూలీ చెల్లించాలని, సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిరుపతి, మురళీమోహన్ పాల్గొన్నారు.

### పంట నష్టపోయిన పొలాల పరిశీలన

బేల, మే 29 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిర్సన్న గ్రామంలో అకాల వర్షాలకు తడసి ముద్దాయినా నువ్వుల పంట పొలాలను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి సాయి తేజారెడ్డి, వ్యవసాయ విస్తీరణాధికారి రమణతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంట నష్టం ఎంత మేరకు వాటిల్లిందో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నేరడిగొండ, మే 29 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఏవో శ్రీధర్‌స్వామి విత్తన వ్యాపారులను హెచ్చరించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని పలు విత్తన దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో వ్యాపారుల నుంచి రసీదు తీసుకోవాలన్నారు. అనంతరం దుకాణాలలో విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, వ్యాపారులు ఉన్నారు.

### గ్రోమోర్ సేవలు వినియోగించుకోండి

నేరడిగొండ, మే 29 : రైతులు గ్రోమోర్ సేవలను వినియోగించుకోవాలని డీఏవో శ్రీధర్‌స్వామి సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని మన గ్రోమోర్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఏవో కృష్ణవేణి, ఏరియా మేనేజర్ వీఎన్‌స్వామి, ఏరియా కంట్రోలర్ నరెంద్ర, న్యూస్టోర్ ఆపరేషన్స్ గోపి, గ్రోమోర్ సెంటర్ మేనేజర్ అనిల్‌కుమార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్‌లు

బోథ్, మే 29 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూన్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వివేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 24 స్లాట్లు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 24 స్లాట్లు మొత్తం రోజుకు 48 స్లాట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. బుకింగ్ చేసుకున్న వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

### బాధితుడిని పరామర్శించిన జడ్జి

ఉట్నూర్ రూరల్, మే 29: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌కు చెందిన జాదవ్ వసంత్‌రావ్ కుమారుడు జాదవ్ వివేక్‌ను శుక్రవారం వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి జాదవ్ అజయ్ కుమార్ పరామర్శించారు. వివేక్ ఏడు సంవత్సరాల క్రితం ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆయన వెంట జాదవ్ అజయ్, సురేశ్, యువరాజ్ ఉన్నారు.

### రైస్ మిల్లులకు తరలించాలి

దస్తురాబాద్, మే 29 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ సూచించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించాలన్నారు.

### ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా భవానిప్రసాద్

ఎదులాపురం, మే 29: ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా ఎస్ భవాని ప్రసాద్ నియమితులయ్యారు. ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్ నగర్ డిప్యూటీ ఆర్ఎంగా విధులు నిర్వహించిన ఆయనను ఆర్ఎంగా ఉద్యోగోన్నతిపై ఆదిలాబాద్ రీజినల్‌కు వచ్చారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా రామయ్య

ఎదులాపురం, మే 29 : ఆదిలాబాద్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా రామయ్య నియమితులయ్యారు. గురువారం ఆర్ఎం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు హైదరాబాద్ ఉప్పల్ వర్క్‌షాప్ హైడ్ అసిస్టెంట్ వర్క్ మేనేజర్‌గా పని చేశాడు. ఉద్యోగోన్నతిపై ఆదిలాబాద్ డిప్యూటీ ఆర్ఎంగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఈ శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

ఎదులాపురం, మే 29: గిగ్ వర్కర్స్, తాత్కాలిక, స్వల్పకాలిక ఉద్యోగాలు చేసే వారు, ప్లాట్‌ఫామ్ వర్కర్స్‌ను ఈ శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక అధికారి జీ రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈశ్రమ్ పోర్టల్ పేర్లు నమోదు చేసుకొని లబ్ధి పొందాలన్నారు. జొమాటో, సిగ్గి, ఫ్లిప్‌కార్డ్, అమెజాన్ సంస్థల్లో పని చేస్తున్న డెలివరీ బాయ్స్‌లందరూ కార్మికులే అని పేర్కొన్నారు.

### మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలి

బోథ్, మే 29: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని అంబేద్కర్ కాలనీ (ఎస్సీ) వార్డు నంబర్-3లో సామూహిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ గురువారం పంచాయతీ కార్యదర్శి అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. మరుగుదొడ్లు నాసిరకంగా నిర్మించడంతో వాటి తలుపులు విరిగిపోవడంతో పాటు పైకప్పు రేకులు పడిపోయాయని పేర్కొన్నారు. వర్షాలు కురిస్తే అక్కడికి వెళ్లడానికి ఇబ్బందిగా మారుతుందన్నారు. కావాల్సిన మరమ్మతులు వెంటనే చేయించాలని కోరారు.

### జొన్న పంట కొనుగోలు సమయాన్ని పొడిగించాలి

బోథ్, మే 29 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో రైతులు సాగు చేసిన జొన్న పంట కొనుగోలు సమయాన్ని పొడిగించాలని బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మెడిచెల్మ ప్రవీణ్ కోరారు. ఈ నెల 30వ తేదీ వరకు కొనుగోలు చేస్తామని అధికారులు నిర్ణయించడం సరికాదన్నారు. ఆలస్యంగా పంట వేసిన రైతులు ఇంకా కోతల పనుల్లో నిమగ్నమై ఉన్నారని పేర్కొన్నారు. రైతుల వద్ద జొన్నలు కొనాలని కోరారు. ఇప్పటికే జొన్న పంటలు అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు.

### సొనాలలో ఎయిడ్స్‌పై అవగాహన

బోథ్, మే 29: ఆదిలాబాద్ జిల్లా సొనాలలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 164 సమగ్ర కౌన్సెలింగ్, పరీక్షా కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ వాహనాల ఏర్పాటు చేసి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది లింగారెడ్డి, నాగరాజు, రంజిత్, నాయకులు గాజుల పోతన్న, ప్రకాశ్ పద్వాల్, రేణుకబాయ్, సాయి పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ నిర్మూలనపై..

సారంగాపూర్, మే 29: నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లోని రైతు వేదికలో ప్రత్యేకాధికారి అబ్దుల్ అజీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నిర్మూలన, ప్రత్యామ్నాయాల వినియోగంపై కిరాణా దుకాణం, హోటల్ యజమానులకు, డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీలో నిర్వహించే సెగ్రిగేషన్ షెడ్డు, కంపోస్టు తయారీ, జ్యాట్ బ్యాగ్ వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, గోపికృష్ణ, పాల్గొన్నారు.

### మొక్కల పెరుగుదలపై దృష్టి సారించాలి

దిలావర్‌పూర్, మే 29 : నర్సరీల్లో మొక్కల పెరుగుదలపై దృష్టి సారించాలని నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం దిలావర్‌పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీని ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. తడి, పోడి చెత్తను వేరు చేసే విధానం గురించి వివరించారు. ఆయన వెంట ఈవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఉన్నారు.

### మహిళల భద్రతే పోలీసుల లక్ష్యం

నిర్మల్ అర్బన్, మే 29 : మహిళల భద్రతే పోలీసుల లక్ష్యమని ఎస్ఐ నర్సయ్య అన్నారు. నిర్మల్‌లోని నారాయణ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఫోక్సో, చైల్డ్ మ్యారేజ్, జువైనల్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం, భరోసా సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతులు పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

నిర్మల్ అర్బన్, మే 29: నిర్మల్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులను గురువారం ఎస్సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు ఓం ప్రకాశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాభివృద్ధి సాధించి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంవో నర్సయ్య, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్పీలు పోతన్న, చిన్నయ్య, సాయన్న, గంగాధర్ పాల్గొన్నారు.

### ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మే 29: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం భద్రాది కొత్తగూడెం జిల్లాలో జరిగిన తెలంగాణ ఆదివాసి బునియాధి కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ బాపురావ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

### రైతులు అధైర్య పడొద్దు

ముథోల్, మే, 29 : రైతులు అధైర్యపడొద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రత్యేకాధికారి సుదర్శన్ అన్నారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో తహసీల్దార్ శ్రీలతతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. వారి వెంట ఆర్ఐలు నారాయణ, సరస్వతి, రైతులు ఉన్నారు.

### తక్షణ సాయం అందజేత

ముథోల్, మే 29 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో గల ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. బాధితులకు తహసీల్దార్ శ్రీలత ఆదేశానురాం తక్షణ సాయం కింద ఆర్ఐ సరస్వతి బియ్యం పంపిణీ చేశారు.

### ముథోల్ ఎస్ఐగా పెర్సిస్

ముథోల్, మే 29 : నిర్మల్ జిల్లా ముథోల్ ఎస్ఐగా పెర్సిస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ముథోల్‌లో పని చేసిన ఎస్ఐ సంజీవ్ నిర్మల్ టౌన్‌కు బదిలీపై వెళ్లారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు

భైంసా, మే 29 : నిర్మల్ జిల్లా భైంసాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రొటక్షన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాల్గవ రోజుకు చేరుకుంది. పలువురు మాట్లాడుతూ బుద్ధ విగ్రహాన్ని పున ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రొటక్షన్ అధ్యక్షుడు దేవిదాస్ హస్డే, తదితరులు ఉన్నారు.